సాక్షి మంచిర్యాల

శనివారం । 21 । జూన్ । 2025

యోగాసన జడ్జి



మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణానికి చెందిన రేవెల్లి రోహిత్ యోగాలో అంచెలంచెలుగా ఎదిగి జాతీయ స్థాయి యోగాసన జడ్జిగా శిక్షణ పూర్తి చేశారు. దేశంలో ఎక్కడైనా యోగా పోటీలు నిర్వహిస్తే అక్కడ జడ్జిగా వ్యవహరించేందుకు అర్హత సాధించారు. యోగా గురువు మండ శ్రీనివాస్ వద్ద 12ఏళ్లు శిక్షణ పొంది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. 2015లో కొల్‌కత్తా, 2017లో విజయవాడలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. 2015, 2016, 2017, 2018, 2020, 2022లో వరుసగా రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో బంగారు పతకాలు అందుకున్నారు. 2023లో యోగాసన కోచ్‌గా సర్టిఫికెట్, ఇటీవల జాతీయ స్థాయి యోగాసన జడ్జి శిక్షణ పొందారు.

ఒంటికి యోగా మంచిదేగా.. - 8లో

గరిష్టం/కనిష్టం
35.0 /28.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఈదురు గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

బెల్లంపల్లికి ఏటీసీ మంజూరు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కేంద్రంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. బెల్లంపల్లి శివారు కన్నాలలో ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 46 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను మంజూరు చేయగా వీటిలో బెల్లంపల్లి ఒకటి కావడం గమనార్హం. కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల విభాగం, టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ భాగస్వామంతో ఏటీసీలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఎన్‌సీవీటీ ఆమోదించిన ఇండస్ట్రీ 4.0 ట్రేడ్‌ల నైపుణ్య కోర్సులను ప్రవేశపెట్టి యువకులకు శిక్షణ, నైపుణ్యం కల్పిస్తారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎగ్జిట్-ఎంట్రీ ఏర్పాటు కృషి



మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ

జైపూర్: వరంగల్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డులో ఎగ్జిట్-ఎంట్రీ ఏర్పాటుకు కృషి చేస్తానని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హామీ ఇచ్చారు. శుక్రవారం పార్వతిబ్యారేజీని సందర్శించిన ఆయనకు స్థానిక ప్రజలు, రైతులు రోడ్డు సంబంధిత సమస్యలపై విన్నవించారు. రోడ్డు మార్గంలో ప్రయాణించడానికి టేకుమట్ల, కుందారం, పార్వతిబ్యారేజీ కిష్టాపూర్ వద్ద అనుమతించాలని కోరారు. స్పందించిన ఆయన పెద్దపల్లి-మంచిర్యాల జిల్లాల ప్రజలకు ప్రయోజనం కలిగించేలా పార్వతిబ్యారేజీ కిష్టాపూర్ వద్ద ఎగ్జిట్-ఎంట్రీ ఏర్పాటుకు కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీకి ప్రతిపాదనలు అందిస్తామని చెప్పారు. అధికారులు ఇప్పటికే ఈ ప్రతిపాదనపై ప్రాథమిక స్థాయిలో సర్వేలు ప్రారంభించారని, త్వరలోనే పూర్తి ప్రణాళికలు సిద్ధం చేయనున్నారని పేర్కొన్నారు.

ఎస్‌హెచ్‌జీలకు రూ.కోటి రుణం




చెక్కు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిది స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు కోటి రూపాయల రుణం చెక్కును మెప్మా టీఎంసీ రఘురాం, ఎస్బీఐ(కళ్యాణిఖనిబ్రాంచ్) మేనేజర్ మల్లవరపు శ్రీకాంత్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ మహేందర్, సిబ్బంది నిహారిక, అశోక్ ప్రసాద్, మెప్మా ఆర్పీలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

23న ఇన్‌స్పైర్ మనక్‌పై టెలి కాన్ఫరెన్స్

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఇన్‌స్పైర్ మనక్‌పై ఈ నెల 23న టెలికాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ ఉంటుందని డీఈవో యాదయ్య తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి విద్యార్థుల ప్రాజెక్టుల నామినేషన్ల కార్యక్రమం జూన్ 15 నుంచి సెప్టెంబర్ 15వరకు ఉందని తెలిపారు. ఈ నెల 23న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు టీశాట్ నెట్‌వర్క్(నిపుణ ఛానల్) ద్వారా టెలికాన్ఫరెన్స్ ఉంటుందని పేర్కొన్నారు. ఇన్‌స్పైర్ అవార్డుల్లో పాల్గొనడానికి సంభావ్య రంగాలను అన్వేషించడం, వినూత్న ప్రాజెక్టులపై అవగాహన కల్పించడం, తదితర విషయాలపై క్లుప్తంగా వివరిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు డీఎస్‌వో మధుబాబును సంప్రదించాలని తెలిపారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో సభ్యులు

మంచిర్యాలటౌన్: జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల 54వ సీనియర్ మహిళల రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు మొదటి స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. వేమనపల్లి మండలానికి చెందిన పాల్కె అనూష, బెజ్జూర్ మండలానికి చెందిన జ్యోతి, మంచిర్యాలకు చెందిన శృతి, కాగజ్‌నగర్‌కు చెందిన ఊర్వశి ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 28నుంచి జూలై 2వరకు గుజరాత్‌లోని భుజ్‌లో జరిగే హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోనె శ్యాంసుందర్ రావు, కనపర్తి రమేశ్, కోచ్ సునార్కర్ అరవింద్ తెలిపారు.

సర్కారు బడికి సై



గ్రామంలో ప్రచారం చేస్తున్న పోక్కూర్ హైస్కూల్ ఉపాధ్యాయులు(ఫైల్)

- బడిబాటలో 3,311మంది విద్యార్థుల ప్రవేశాలు
- ప్రైవేటు పాఠశాలల నుంచి 1,509 మంది చేరిక

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో నిర్వహించిన బడిబాట కార్యక్రమం సత్ఫలితాలనిచ్చింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరిగింది. బడుల బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు విద్యార్థులను సర్కారు బడిబాట పట్టేలా చేసింది. ఉపాధ్యాయుల నియామకం, ఖాళీగా ఉన్న చోట సర్దుబాటు ద్వారా సబ్జెక్టు టీచర్ల కొరతను అధిగమించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ తరగతులు, ఏఐ పాఠాలు తదితర చర్యలు చేపట్టారు. కొత్త ప్రవేశాలు ఎక్కువగా ఒకటో తరగతిలోనే వచ్చాయి. ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. నాణ్యమైన విద్యాబోధన, ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంలు, పౌష్టికాహారం అందిస్తున్నారు. ప్రైవేటులో ఫీజులు భారంగా మారి ప్రభుత్వ బడుల్లో చేరుతుండడంతో కళకళలాడుతున్నాయి. ఈ నెల 6నుంచి 19వరకు నిర్వహించిన బడిబాట గురువారం ముగియగా.. 3,311మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. మరింతగా అడ్మిషన్లు పెరిగే అవకాశాలున్నాయి.

ప్రైవేట్ నుంచి..

నర్సరీలోనే ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల మోత మోగుతోంది. వేలాది రూపాయలు ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు ఇలా రకరకాల కొనుగోళ్ల భారం పడుతోంది. సర్కారు పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమం కొనసాగుండడం, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్య అంది స్తుండడం వల్ల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో 3,688 మంది, 20 24-25లో 3,572 మంది విద్యార్థులు చేరారు.

ఒకటి నుంచి పది వరకు..

ఈ ఏడాది ఒకటో తరగతిలో ప్రైవేటు, అంగన్‌వాడీ కేంద్రాలు, నేరుగా ప్రవేశాలు పొందిన విద్యార్థులు 2,493మంది ఉన్నారు. రెండు నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన వారు 1,802మంది ఉన్నారు. 2నుంచి 10వరకు 1,509మంది ప్రైవేటు నుంచి ప్రభుత్వ బడుల్లో చేరడం గమనార్హం. మంచిర్యాల మండలంలోనే 263మంది ప్రవేశాలు పొంది ముందు వరుసలో నిలువగా, లక్సెట్టిపేట మండలంలో 198 మంది విద్యార్థులతో తర్వాత స్థానంలో నిలిచారు.

ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలలకు..

మండలం	విద్యార్థులు
బెల్లంపల్లి	315
భీమిని	32
భీమారం	118
చెన్నూర్	235
దండేపల్లి	282
హాజీపూర్	162
జైపూర్	106
జన్నారం	376
కన్నెపల్లి	126
కాసిపేట	115
కోటపల్లి	106
లక్సెట్టిపేట	386
మంచిర్యాల	414
మందమర్రి	129
నస్పూర్	151
నెన్నెల	122
తాండూర్	37
వేమనపల్లి	99

తల్లిదండ్రులకు నమ్మకం పెరిగింది..

ప్రభుత్వ బడిలో వసతులతో కూడిన విద్య అందిస్తుండడంతో తల్లిదండ్రులకు నమ్మకం పెరిగింది. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం అధిక ఫీజులు వసూలు చేయడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుంది. సర్కారు బడుల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తుండడంతోపాటు పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం కూడా అందిస్తుండడం వల్ల చేరుతున్నారు.
– ఎస్.యాదయ్య, డీఈవో

బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్



కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో



బీఆర్‌ఎస్ నాయకుల రాస్తారోకో

- బీఆర్‌ఎస్ విద్యార్థి నాయకుడిపై దాడితో ఆందోళన
- పోటాపోటీగా నగరంలో రాస్తారోకోలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం పోటాపోటీగా రాస్తారోకోలు నిర్వహించారు. నస్పూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ విద్యార్థి నాయకుడు దగ్గుల మధు గురువారం రాత్రి జరిగిన దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు పరామర్శించారు. అనంతరం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడిని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే దాడికి పాల్పడ్డారని, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు హస్తం ఉందని ఆరోపించారు. దాడులు, తప్పుడు కేసులతో జైల్లో వేసే కార్యక్రమాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులకు కారణమైన వారికి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులను పోలీసులు పోలీసుస్టేషన్‌కు తరలించారు. స్టేషన్ ఎదుట బీఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగారు. మధుపై దాడికి కారణమైన నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ సురిమిల్ల వేణు, అతడి అనుచరులను చట్టప్రకారం శిక్షించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌కు సంబంధం లేదు

మంచిర్యాల ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావుపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం బెల్లంపల్లి చౌరస్తాలో రాస్తారోకో చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, నస్పూర్ మాజీ చైర్మన్ వేణు మాట్లాడుతూ మద్యం మత్తులో జరిగిన గొడవను కాంగ్రెస్ పార్టీకి అంటగట్టడం సరికాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో భూకబ్జాలకు గంజాయిని విచ్చలవిడిగా వినియోగించుకునేలా చేసిందెవరో అందరికీ తెలుసునని పరోక్షంగా మాజీ ఎమ్మెల్యేను విమర్శించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రమోద్‌రావు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో బీఆర్‌ఎస్వీ నాయకుడు దగ్గుల మధుకర్‌పై జరిగిన దాడి కేసులో ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. నస్పూర్‌కు చెందిన మధుకర్, నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ సురిమిల్ల వేణు, పాదం కుమార్, అరికె రాకేష్, గుర్రాల వంశీ విందు చేసుకున్నారని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ వద్ద స్కూటీ ఉందని, అక్కడ దిగుతానని మధుకర్ వారితో కలిసి వచ్చాడని తెలిపారు. వేణు తన నాయకుడైన జగన్‌మోహన్‌రావు ఇంటికి వెళ్లాడని పేర్కొన్నారు. అక్కడ జగన్‌మోహన్‌రావు డ్రైవర్ ఆత్మకూరి సంజీవ్, మధుకర్‌కు పాత గొడవలు ఉండగా.. సంజీవ్, అతడి అనుచరులు డీటీ సాయి, మరికొందరు మారణాయుధాలతో మధుకర్‌పై దాడి చేశారని పేర్కొన్నారు. మధుకర్ ఫిర్యాదు మేరకు సంజీవ్, సాయి, వేణు, కుమార్, రాకేష్, వంశీ, మరికొందరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. జగన్‌మోహన్‌రావు ఇంటి కాంపౌండ్‌లోకి అక్రమంగా ప్రవేశించి ప్రశ్నించిన వారిని మధుకర్ అతడి స్నేహితులు దూషిస్తూ కొట్టారని పేర్కొన్నారు. ఇస్లాంపుర గౌతమినగర్‌కు చెందిన ఎలుకపెల్లి వినయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

దరఖాస్తుల వెల్లువ



భీమారం మండలంలో రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్(ఫైల్)

- ముగిసిన రెవెన్యూ సదస్సులు
- ఆగస్టు వరకు పరిష్కారం

మంచిర్యాలఅగ్రికల్చర్: భూ సమస్యల పరిష్కారానికి జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు శుక్రవారం ముగిసాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన నూతన భూభారతి చట్టం-2025 అమలులో భాగంగా ఈ నెల 3నుంచి 20వరకు గ్రామాల్లో 366 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 14,330 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల ప్రక్రియ నిరంతరమని ప్రకటించినప్పటికీ చివరి మూడు రోజుల్లో భారీగా వచ్చినట్లు తెలుస్తోంది. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాడ్యూల్స్ వారీగా నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. అధికంగా బెల్లంపల్లి, కన్నెపల్లి, నెన్నెల, భీమిని మండలాల్లో దరఖాస్తులు అందగా.. ఇందులో సాదాబైనామాలు, పీవోటీ, సర్వేనంబర్లు లేకపోవడం, అసైన్డ్, విరాసత్, కోర్టు వివాదాలు ఎక్కువగా ఉన్నాయి. రెవెన్యూ సదస్సుల్లో ప్రతీ రోజు కలెక్టర్ కుమార్ దీపక్ ఏదో ఒక చోట పాల్గొని అధికారులకు సూచనలు చేశారు. గత నెలలో భూభారతి చట్టం ప్రారంభించి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన భీమారం మండలంలో 2200 దరఖాస్తులు అందాయి. గతంలో దరఖాస్తుకు రూ.వెయ్యి చొప్పున తీసుకున్నారు. ప్రస్తుతం రెవెన్యూ అధికారులే గ్రామాలకు వచ్చి సదస్సుల్లో దరఖాస్తులు స్వీకరించడంతో వెల్లువలా వచ్చాయి.

ప్రతీ మండలంలో రెండు బృందాలు

ప్రతీ మండలంలో రెండు బృందాలు రెవెన్యూ సదస్సులు నిర్వహించాయి. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బృందాలు ఆయా గ్రామాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న భూసమస్యలు, అవస్థలు, ధరణి పోర్టల్‌తో ఏర్పడిన ఇబ్బందులతో తహసీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్ చుట్టూ తిరిగిన పరిష్కారం కానివి భూభారతి చట్టంతో పరిష్కారమవుతాయనే ఆశతో దరఖాస్తులు అందజేశారు. భూ రికార్డుల్లో పేర్ల తప్పులు, విస్తీర్ణం హెచ్చుతగ్గులు, వారసత్వ భూములు, భూస్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వేనంబరు, పట్టాపాస్ పుస్తకాలు లేకపోవడం, తదితర వాటిపై దరఖాస్తులు అందాయి. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆగస్టు 14లోపు అర్జీలు పరిశీలించి పరిష్కరించనున్నారు.

రోజువారీగా నివేదికలు

రెవెన్యూ సదస్సుల్లో ఏ గ్రామంలో నిర్వహించిన సదస్సులో ఎన్ని దరఖాస్తులు అందాయి, ప్రభుత్వ, పట్టా భూములకు సంబంధించినవి ఎన్ని ఉన్నాయి, డివిజన్లు, సమస్యల వారీగా వివరాలతో తహసీల్దార్లు నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. వాటిని అదే రోజున సీసీఎల్‌ఏకు పంపించారు. గతంలో మాదిరిగా ప్రతీ చిన్న పనికి కలెక్టర్ సీసీఎల్‌ఏ వరకు వెళ్లాల్సిన పని లేదు. భూభారతి చట్టం అమలులో భాగంగా ప్రభుత్వం తహసీల్దార్లకు సిటిజన్ లాగిన్ అవకాశం కల్పించింది. తహసీల్దార్ పరిధిలో పరిష్కరించేవి, పరిష్కారానికి అనుకూలంగా లేనివి వేరు చేస్తారు.

అవగాహన లేక దూరం..

భూ సమస్యలపై అనేకమార్లు తహసీల్దార్, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్న వారు ఉన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల సమాచారం లేకపోవడంతో కొందరు దూరమయ్యారు. పెద్ద గ్రామాల్లోనూ సదస్సులను ఒకే రోజులో ముగించారు. భూములు ఒక మండలం, నివాసం ఒక చోట, వృత్తిరీత్యా పట్టణ ప్రాంతాల్లో ఉన్న వారు సదస్సులపై సమాచారం లేక రాలేకపోయారు. గ్రామాల్లో చాటింపు, వాట్సాప్ ద్వారా సమాచారం అందించామని అధికారులు పేర్కొంటున్నారు.

క్రికెట్ లీగ్ పోటీల్లో సత్తా చాటిన సుప్రీత్

- అకాడమీలో ఉచిత శిక్షణకు అర్హత



బ్యాటింగ్ చేస్తున్న సుప్రీత్‌రెడ్డి

జన్నారం: గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లోని పయనీర్ గ్రౌండ్‌లో నిర్వహించిన రైజింగ్ భారత్ క్రికెట్ లీగ్ పోటీల్లో తెలంగాణ జూనియర్స్ తరఫున పాల్గొన్న జన్నారం మండలం రేండ్లగూడకు చెందిన ఏనుగు సుప్రీత్‌రెడ్డి అద్భుతమైన ఆల్‌రౌండర్ ప్రదర్శనతో అందరినీ మెప్పించాడు. ఈ లీగ్‌లో ఎంపిక కావాలంటే బ్యాట్స్‌మెన్ 90 పరుగులు, ఆల్‌రౌండర్లు 40 పరుగులు, నాలుగు వికెట్లు తీయాల్సి ఉంటుంది. సుప్రీత్‌రెడ్డి 51పరుగులు చేసి ఐదు వికెట్లు తీసి అర్హత సాధించాడు. దీంతో దేశంలోని గుర్తింపు పొందిన ఏ క్రికెట్ అకాడమీ నుంచి అయినా ఉచితంగా శిక్షణ పొందే అవకాశం లభించినట్లు సుప్రీత్‌రెడ్డి తండ్రి ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 18, 19న అహ్మదాబాద్‌లో జరిగిన అదనపు శిక్షణ ఎంపిక పోటీల్లో సుప్రీత్‌రెడ్డి పాల్గొన్నాడు. మొదటి మ్యాచ్‌లో 30 పరుగులు చేయగా, రెండో మ్యాచ్‌లో ఐదు పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి రెండు వికెట్లు తీశాడు. ఈ ప్రదర్శనతో తదుపరి రెండు మ్యాచ్‌లకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. కెప్టెన్‌గా రెండు మ్యాచ్‌ల్లో 16పరుగులు చేసి నాటౌట్‌గా నిలవడంతోపాటు మూడు కీలక వికెట్లు తీశాడు. దీంతో సుప్రీత్‌రెడ్డి అదనపు శిక్షణ కోసం క్రికెట్ అకాడమీలో చేరేందుకు ఎంపికయ్యాడు. సుప్రీత్‌రెడ్డిని స్లేట్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీశ్యాంలాల్, పీఈటీలు సంతోష్, నగేష్, వినీత్, ఉపాధ్యాయులు అభినందించారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న సాధకులు, ప్రజలు

మంచిర్యాలటౌన్: నిత్యం యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో ఒక భాగం చేసుకోవాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం 'యోగాతో మీ జీవితాన్ని మార్చుకోండి' అనే నినాదంతో యోగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ యోగాపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలని యోగా సాధన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అమిరిశెట్టి రాజ్‌కుమార్, గాజుల ముఖేశ్‌గౌడ్, ఆకుల అశోక్‌వర్ధన్, రఘునందన్, బియ్యాల సతీశ్ రావు, జోగుల శ్రీదేవి, కర్రె లచ్చన్న, బోయిని హరికృష్ణ, యోగ గురువు శ్రీనివాస్, గాజుల ప్రభాకర్, విజయ్, దామెరకుంట రాజయ్య పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నియంత్రించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల భవిష్యత్తుపై మాదకద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాదకద్రవ్యాల నియంత్రణపై డీసీపీ భాస్కర్, అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి నందగోపాల్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగాలను నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ నెల 21న యోగా డేలో భాగంగా 'సే నో టు డ్రగ్స్-సే ఎస్ టు యోగా' నినాదంతో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన శిబిరాలు నిర్వహించాలని, 22న హైరిస్క్ జోన్స్, పని ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు, 23న మొక్కలు నాటడం, 24, 25న విద్యార్థులు, యువతను భాగస్వాములు చేస్తూ అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేయాలని తెలిపారు. 26న జిల్లా స్థాయిలో మిషన్ పరివర్తన స్టాల్స్ ఏర్పాటు, రాజకీయ నాయకులు, విద్యార్థులు సంయుక్తంగా ర్యాలీలు నిర్వహించి జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో మానవహారం ఏర్పాటు చేసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయాలని తెలిపారు. జైపూర్, బెల్లంపల్లి ఏసీపీలు వెంకటేశ్వర్లు, రవికుమార్, మానసిక వైద్య నిపుణులు, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

కనీస కూలి అమలుకు చర్యలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో కనీస కూలి అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్మికులను మూడు వర్గాలుగా విభజించామని తెలిపారు. అన్ స్కిల్డ్ కార్మికులకు మున్సిపల్, నాన్ మున్సిపల్, ఏజెన్సీ ప్రాంతాల వారీగా చెల్లింపులను ప్రతిపాదించినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

పెండింగ్ అర్జీలు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: వివిధ సమస్యలపై ప్రజావాణిలో అందిన పెండింగ్ అర్జీలు పరిష్కరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల వాహనాల పర్మిట్, ఫిట్‌నెస్ పత్రాలను తనిఖీ చేయాలని, లేని వాటిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. వానాకాలానికి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ పరిధిలో 177 దరఖాస్తులు రాగా ఒకటి పెండింగ్‌లో ఉందని, అధికంగా వస్తున్న అంశాల సంబంధిత దరఖాస్తులపై తీసుకున్న చర్యలతో నివేదిక అందించాలని తెలిపారు.

'కేంద్ర ప్రభుత్వ కుట్రలు తిప్పి కొట్టాలి'



మాట్లాడుతున్న అధ్యక్షుడు సీతారామయ్య

కాసిపేట: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, కార్మిక చట్టాలు మార్చి కార్మికులపై పనిభారం పెంచే కుట్రలను తిప్పికొట్టాలని, ఇందుకోసం జూలై 9న జరిగే ఒక్క రోజు సమ్మె విజయవంతం చేయాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు, శాశ్వత వేజ్‌బోర్డు సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. శుక్రవారం మందమర్రి ఏరియా కాసిపేట-2గనిపై ఏర్పాటు చేసిన గేటు మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలు దశల వారీగా పరిష్కరిస్తామని తెలిపారు. సొంతింటి పథకం అమలు, పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ మినహాయింపునకు కమిటీ వేశారని తెలిపారు. గనిలో కార్మికులు సామాను భద్రపర్చుకునేందుకు గదులు ఏర్పాటు చేయాలని, కార్మికులు, మైనింగ్ స్టాఫ్ సమస్యలను గని మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. కాగా, గనికి చెందిన 29మంది కార్మికులు ఏఐటీయూసీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ అక్బర్ అలీ, సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, బ్రాంచి సెక్రెటరీలు దాగం మల్లేష్, సలేంద్ర సత్యనారాయణ, సుదర్శన్, రాజేశ్వరరావు, ఐలయ్య, ఫిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, ఫిట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ కొండపల్లి నర్సయ్య, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ బొద్దుల వెంకటేష్, కృష్ణచారి, రాజకుమార్ పాల్గొన్నారు.

సత్తా చాటుతున్న శ్రీజ, వరుణ్



ఆసనాలు వేస్తున్న శ్రీజ, వరుణ్

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీ హెచ్ఎస్ విద్యార్థులు జిల్లాస్థాయి యోగా పోటీల్లో రాణిస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నారు. పీడీ ఇమ్రాన్ రెండేళ్లుగా విద్యార్థులకు యోగాలో మెళకువలు నేర్పిస్తూ ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. గతేడాది డిసెంబర్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థిని శ్రీజ ఉత్తమ ప్రతిభ కనబరిచింది. నిజామాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంది. ఎనిమిదో తరగతి విద్యార్థి వరుణ్ గతేడాది సీఎం కప్ పోటీల్లో జిల్లా స్థాయిలో రాణించి హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడు.



అసాధ్యాలన్నింటినీ సుసాధ్యం చేసే మహోన్నత శక్తి యోగాకు ఉంది. ఈ భారతీయ పురాతన ప్రక్రియకు రోజురోజుకూ క్రేజ్ పెరుగుతోంది. ఇది ఎందరో ఆచరించి ప్రయోజనం పొందుతున్న దివ్య సాధనం. నిత్య జీవితంలో తప్పనిసరిగా మారిన శాస్త్రీయ వ్యాయామ సమ్మిళిత సంపద. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కథనం..

ఒంటికి యోగా మంచిదేగా..

- అన్ని వర్గాల్లోనూ పెరుగుతున్న ఆసక్తి • నేడు నిత్యజీవితంలో భాగమైన వైనం
- మానసిక ప్రశాంతతకు దివ్య ఔషధం • ఆరోగ్యకర జీవనానికి ప్రయోజనకరం
- వ్యాయామ సాధనాల సమాహారం • నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



యోగా గురువులకు కేరాఫ్ ఇలేగాం

భైంసా/భైంసాటౌన్: మండలంలోని ఇలేగాం యోగా గురువులకు కేరాఫ్‌గా నిలుస్తోంది. పలువురు యోగా నేర్చుకుని ఉపాధిమార్గంగా మలుచుకున్నారు. అబ్దుల్ మతీన్ యోగా సాధన చేస్తూ గ్రామానికి చెందిన పలువురికి శిక్షణ ఇచ్చాడు. ఇతని వద్ద యోగా నేర్చుకున్న ఉప్పు రవీందర్, సీహెచ్ వీరన్న, గంగాధర్, కృష్ణకుమార్, పోతన్న డిగ్రీ పూర్తయ్యాక బెంగళూర్‌లోని వ్యాస యూనివర్సిటీలో యోగాలో ఎమ్మెస్సీ పూర్తి చేశారు. అబ్దుల్ మతీన్ పంచాయతీ కార్యదర్శిగా ప్రభుత్వ ఉద్యోగం సాధించగా, రవీందర్, వీరన్న, పోతన్న ఇటీవల ఆయుష్ విభాగంలో యోగా శిక్షకులుగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. కృష్ణకుమార్ హైదరాబాద్‌లో ఉంటూ ఆన్‌లైన్ ద్వారా విదేశాల్లోని ఔత్సాహికులకు యోగాలో శిక్షణ ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. గంగాధర్ హైదరాబాద్‌లో యోగా శిక్షణ ఇస్తూ జీవనం సాగిస్తున్నారు.

బాసరలో శిక్షణ ఇస్తున్న



బాసరలో యోగా శిక్షణ ఇస్తున్న. పాఠశాల పిల్లలంతా జాతీయ స్థాయిలో రాణించారు. నేను చిన్నప్పుడు హైస్కూల్‌లో చదివేటప్పుడు యోగాసనాలు నేర్చుకున్నా. అవే ఆసనాలు నన్ను కోచ్‌గా మార్చాయి. ప్రస్తుతం ఎంతోమంది పిల్లలకు శిక్షణ ఇస్తున్న. యోగా నాకు ఆరోగ్యంతో పాటు ఉపాధినిస్తోంది. ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేస్తే ఏ ఇబ్బందులు ఉండవని సూచిస్తున్నా.

– కోకినోళ్ల మల్లేశ్

22ఏళ్లుగా సాధన



2003 నుంచే యోగా సాధన ప్రారంభించాను. 15సార్లు జిల్లాస్థాయిలో, 10 సార్లు రాష్ట్ర స్థాయిలో, ఏడుసార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. అంతర్జాతీయస్థాయి పోటీల్లోనూ పాల్గొన్నాను. ప్రస్తుతం నిజామాబాద్ యోగా అసోసియేషన్‌లో కార్యదర్శిగా, తెలంగాణ యోగా అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రిఫరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. యోగా సాధనతో ఇప్పటివరకు ఎలాంటి అనారోగ్య సమస్యలు దరిచేరలేదు.

– గంగాధర్, ఇలేగాం

ఆయుష్‌లో ఉద్యోగం



నేను 14 ఏళ్లుగా యోగా శిక్షకుడిగా చేస్తున్నాను. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాను. నా వద్ద యోగా నేర్చుకున్న విద్యార్థులు పలుసార్లు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించారు. ఫిబ్రవరిలో నిర్వహించిన జాతీయస్థాయి యోగా రిఫరీ డిప్లమో పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాను. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ అశోక్ అగర్వాల్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నాను. ప్రస్తుతం ఆయుష్ విభాగంలో యోగా ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తున్న.

– ఉప్పు రవీందర్, ఇలేగాం

ఉపాధినిచ్చింది



నేను 2005 నుంచి యోగా సాధన ప్రారంభించాను. గురువు అబ్దుల్ మతీన్ వద్ద యోగా నేర్చుకున్నాను. డిగ్రీ తరువాత యోగాలో ఎమ్మెస్సీ పూర్తి చేశాను. 2016లో ప్రణవ అథ యోగా ఇనిస్టిట్యూట్‌ను సొంతంగా ప్రారంభించి దాదాపు 300 మందికి శిక్షణ ఇచ్చాను. యోగా థెరపిస్ట్‌గా పనిచేస్తున్నాను. ఇటీవలే ఆయుష్‌లో యోగా శిక్షకుడిగా ఉద్యోగం పొందాను. యోగాతో ఆరోగ్యంతోపాటు ఉపాధి లభించింది.

– సీహెచ్ వీరన్న, ఇలేగాం

ఢిల్లీలో శిక్షణ ఇస్తున్న



ఇలేగాంలో యోగాసనాలు నేర్చుకున్న నేను ఢిల్లీలోని కార్పొరేట్ కంపెనీల ఉద్యోగులకు యోగా శిక్షణ ఇస్తున్న. పెళ్లి చేసుకుని ఢిల్లీలోనే స్థిరపడ్డాను. నా భాగస్వామి కూడా యోగా శిక్షణ ఇస్తోంది. యోగా నా జీవితాన్ని మార్చివేసింది. ఆరోగ్యం కోసం నేర్చుకున్న యోగా నాకు ఎంతో గుర్తింపు తెచ్చింది. టర్కి దేశంలోని ఇస్తాంబుల్ రాజధాని సమీపంలో విదేశీయులకు యోగా శిక్షణ ఇవ్వడం మరిచిపోలేను.

– కృష్ణకుమార్, ఇలేగాం

నాకు గర్వంగా ఉంది



26 ఏళ్ల క్రితం ఇలేగాం గ్రామానికి వెళ్లాను. అప్పట్లో బాపూజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాం. యువకులకు రోజూ యోగా శిక్షణ ఇచ్చేవాళ్లం. ఇప్పుడు ఆ గ్రామం నుంచి ఆరుగురు యోగా కోచ్‌లుగా మారారు. ఎంతోమంది యువకులు యోగాసనాలు వేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. వారిని చూస్తే నాకు గర్వంగా ఉంది.

– నాగేశ్, మనోరమ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్

జాతీయస్థాయిలో మెరిసిన గౌరి



జాతీయస్థాయిలో బంగారు పతకంతో గౌరి

భైంసాటౌన్: పట్టణంలోని రాహుల్‌నగర్‌కు చెందిన గౌరి యోగా పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర, జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించింది. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న గౌరి కోచ్ ఉప్పు రవీందర్ శిక్షణలో యోగాసనాల్లో మెళకువలు నేర్చుకుంది. దాదాపు నాలుగేళ్లుగా యోగాలో శిక్షణ పొందుతూ పలుసార్లు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. గత సెప్టెంబర్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండో స్థానం కైవసం చేసుకుంది. ఫిబ్రవరిలో పంజాబ్‌లోని లూధియానాలో యోగాసన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించింది.

ప్రశాంతంగా ఉండవచ్చు



లక్ష్మణచాంద: నిత్యం యోగా చేస్తే రోజంతా మానసికంగా ఎంతో ప్రశాంతంగా ఉండవచ్చు. శారీరక దృఢత్వం పెరుగుతుంది. నేను మూడు సంవత్సరాలుగా యోగా సాధన చేస్తున్నాను. మండల స్థాయిలో పలుసార్లు ప్రశంసలు పొందాను.

– శ్రీనిత్య, కేజీబీవీ విద్యార్థిని, లక్ష్మణచాంద

ఆరోగ్యానికి మేలు



లక్ష్మణచాంద: పరీక్షల సమయంలో నిత్యం యోగా సాధన చేస్తే ఒత్తిడిని జయించవచ్చు. యోగా మాలాంటి విద్యార్థినులకు ఎంతో మేలు చేస్తుంది. రెండు సంవత్సరాలుగా యోగా సాధన చేస్తున్నాను. పలువురి చేత ప్రశంసలు పొందాను.

– అమూల్య, కేజీబీవీ విద్యార్థిని, లక్ష్మణచాంద

యోగా గ్రామం.. రోటిగూడ



జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న హృషికేశ్‌తో తిరుపతి (ఫైల్)

జన్నారం: మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు యోగా పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. గ్రామానికి చెందిన ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపతి గ్రామంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నారు. 2018లో మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో శివనూరి హృషికేశ్ పాల్గొని ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. 2020లో ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. 2024లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీహాస ద్వితీయ స్థానంలో నిలిచింది.

20 ఏళ్ల కష్టానికి ప్రతిఫలం



చెన్నూర్: ప్రాథమికవిద్య స్థాయి నుంచే యోగాలో శిక్షణ పొందాను. సుమారు 20 ఏళ్లుగా యోగాతో సహవాసం చేశాను. పది మందికి నేర్పించాలనే సంకల్పంతో యోగా టీచర్ కోర్సు చేశా. ఐదేళ్ల క్రితం శిక్షణ పూర్తి కాగా ఆయుష్ యోగా మందిరాల్లో శిక్షకుడిగా చేరాలని ప్రయత్నించా. ప్రస్తుత ప్రభుత్వం గతేడాది ఆయుష్ యోగా మందిర్‌లో శిక్షకుడిగా నియమించింది. యోగా టీచర్‌గా యోగా మందిరంతో పాటు వివిధ ప్రాంతాల్లో శిక్షణ ఇస్తున్నా.

– మోర్ల మధుకర్, యోగా శిక్షకుడు


ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు



చెన్నూర్: సమయపాలన లేకుండా వివిధ పనులు చేస్తున్న ప్రజలు ఒత్తిడికి లోనై అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతీరోజు ఉదయం, సాయంత్రం గంటపాటు యోగాకు కేటాయిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాల్సిన అవసరముంది. యోగాపై అవగాహన లేని వారంతా అంతర్జాతీయ యోగా డే సందర్భంగానైనా యోగా సాధన ప్రారంభించండి.

– ఇప్ప రజిత, ఆయుష్ యోగా మందిర్ శిక్షకురాలు

రిటైర్డయినా యోగా మాస్టర్‌గా..



యోగా మాస్టర్ భగవన్‌దాస్

లక్సెట్టిపేట: పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి రావల్లి భగవన్‌దాస్ పదేళ్లుగా యోగా సాధన చేస్తున్నారు. ఇతడి ప్రతిభను గుర్తించి బహుజన రైటర్స్ ఆధ్వర్యంలో బెస్ట్ యోగా మాస్టర్‌గా 2024లో హైదరాబాద్‌లో జాతీయ అవార్డు అందజేశారు. ప్రస్తుతం భగవాన్‌దాస్ మంచిర్యాల, లక్సెట్టిపేటలో శ్రీ యోగా ఉచిత శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి పలువురికి శిక్షణ ఇస్తున్నారు.

యోగాలో శ్రీనాథ్‌కు బహుమతులు

దండేపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి శ్రీనాథ్ చదువుతో పాటు యోగాలో రాణిస్తున్నాడు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రవి ప్రోత్సాహంతో పలు యోగా పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించాడు. జిల్లా, జోనల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుపొందాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతి సాధించడమే తన లక్ష్యమని చెబుతున్నాడు.

ఆసనం వేస్తున్న శ్రీనాథ్





కల్లూరులో విద్యార్థులకు ఆసనాలు నేర్పిస్తున్న గజానన్

15 ఏళ్లుగా ఉచిత శిక్షణ

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన గజానన్ 15 ఏళ్లుగా యువకులు, మహిళలకు ఉచితంగా యోగాలో శిక్షణ ఇస్తున్నారు. గతేడాది ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో మండలానికి ఇద్దరు శిక్షకులను ప్రభుత్వం నియమించింది. వారు ఆయా పాఠశాలల ఆవరణల్లో, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో నిత్యం యోగాలో మెళకువలు నేర్పిస్తున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రతీ గ్రామంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా సాధన తప్పనిసరిగా అవసరం. గ్రామగ్రామాన యోగాసనాలు నేర్చుకునేందుకు విద్యార్థులు ముందుకువస్తున్నారు.

– సిర్ల మౌనిక, శిక్షకురాలు, కుంటాల

- డీసీసీబీ మాజీ చైర్మన్ హరీశ్‌రావు కిడ్నాప్ కేసు ఛేదించిన పోలీసులు

కిడ్నాప్ కేసులో ఆరుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ రాజేశ్ మీనా, రూరల్ సీఐ కృష్ణ

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లాలో ఈనెల 15న సంచలనం సృష్టించిన కిడ్నాప్, హత్యాయత్నం, దొంగతనం కేసును నిర్మల్ పోలీసులు ఛేదించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ జానకీ షర్మిల వివరాలు వెల్లడించారు. మామడ మండలం పొన్కల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ హరీశ్‌రావు వద్ద అదే గ్రామానికి చెందిన షేక్ హైదర్ 2005లో డ్రైవర్‌గా పనిచేసేవాడు. హైదర్ ప్రవర్తన నచ్చక ఆరు నెలలకే హరీశ్‌రావు పని నుంచి తీసివేశాడు. దీంతో షేక్ హైదర్ హరీశ్‌రావుపై పగ పెంచుకున్నాడు. గుంటూరు జిల్లాకు చెందిన బానాల ప్రిన్స్, విజయవాడకు చెందిన తట్టూరి రవి, కళకంటి సురేశ్, గూడె కోటేశ్వరరావుతో కలిసి హరీశ్‌రావును ఈనెల 15 అర్ధరాత్రి అతడి ఇంటి నుంచి కిడ్నాప్ చేశారు. ఈ సందర్భంగా ఇంట్లో ఉన్న బంగారు చైన్, రెండు బంగారు బిల్లలు, డైమండ్ ఉంగరం, రూ.5వేల నగదు దొంగిలించారు. కారులో కత్తులతో బెదిరిస్తూ.. అతని బంధువులకు ఫోన్లు చేయించి రూ.3కోట్లు డిమాండ్ చేశారు. మార్గమధ్యలో మనోహరాబాద్ టోల్ ప్లాజా వద్ద కారు ఆపగా హరీశ్‌రావు వారి నుంచి తప్పించుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్పీ జానకీ షర్మిల వెంటనే ఏఎస్పీ రాజేశ్ మీనా నేతృత్వంలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నాలుగు రోజుల వ్యవధిలోనే నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి కిడ్నాప్‌నకు వాడిన కారు, బాధితుడి కారు, బంగారు చైన్, బాధితుడి పర్సు, రూ.2వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు, రెండు కత్తులు, రెండు ఇంచుల ప్లాస్టర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన ఏఎస్పీ రాజేశ్ మీనా, ఇన్‌స్పెక్టర్లు గోవర్ధన్‌రెడ్డి, కృష్ణ, సమ్మయ్య, ఎస్సైలు ప్రదీప్, శ్రీనివాస్, లింబాద్రి, శ్రీకాంత్, అశోక్‌ను ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు.

ఆర్జీయూకేటీకి 18,775 దరఖాస్తులు

- నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

భైంసా: 2025–26 విద్యాసంవత్సరంలో ఆర్జీయూకేటీలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు గడువు శనివారం ముగియనుంది. శుక్రవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 18,775 దరఖాస్తులు వచ్చాయని వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. చివరి రోజు మరిన్ని దరఖాస్తులు వస్తాయని పేర్కొన్నారు. జూలై 4న ప్రవేశాల మెరిట్ జాబితా విడుదల చేసి 7వ తేదీ నుంచి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బ్లేడ్‌తో కోసుకుని ఆత్మహత్యాయత్నం

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద పాత నిందితుడు అరుణ్ బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వస్తాద్ అరుణ్ అనే యువకుడిపై గతంలో కేసు నమోదు కాగా కోర్టు విచారణకు హాజరు కాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. శుక్రవారం పోలీసులు నిందితుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అరుణ్ కోర్టుకు హాజరు కావాలని తెలుపగా ఇంటిలో లేడని తెలిపారు. ఈ క్రమంలో నిందితుడి కోసం గాలిస్తుండగా స్థానిక బస్టాండ్ వద్ద కనిపించాడు. పోలీసులు దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేయగా అరుణ్ తన దగ్గరున్న బ్లేడుతో గొంతు కోసుకునే ప్రయత్నంలో గాయాలయ్యాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు అరుణ్‌ను అదుపులోకి తీసుకుని చికిత్స కోసం రిమ్స్‌కు తరలించినట్లు ఇచ్చోడ సీఐ రాజు తెలిపారు. ప్రస్తుతం అరుణ్ చికిత్స కోలుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇతడు గతంలోనూ బ్లేడుతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లోనే ఎస్సై, హోంగార్డ్‌లపై దాడి చేసి గాయపరిచాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన దర్మ వెంకటేశ్ (22) గురువారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. డ్రైవర్‌గా పనిచేస్తూ జీవించే వెంకటేశ్ ఏడాది కాలంగా మద్యానికి బానిసయ్యాడు. పని మానేసి జులాయిగా తిరుగుతుండేవాడు. పని చేసుకోవాలని తల్లి చంద్రకళ ఎంత చెప్పినా వెంకటేశ్ తన పద్ధతి మార్చుకోలేదు. గురువారం సాయంత్రం మద్యం సేవించి వెంకటేశ్ ఇంటికి రాగా తల్లి మందలించింది. భోజనాల తర్వాత ఇంటి పక్కనే నివాసముండే తన పెద్దమ్మ భారతి ఇంట్లో నిద్రిస్తానని వెంకటేశ్ వెళ్లాడు. కొద్ది సేపటికే చంద్రకళ భారతి ఇంటికి వెళ్లి చూడగా వెంకటేశ్ ఇంటి పైకప్పు ఇనుప పైపునకు ఉరేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.